

స్వర్ణ రథంపై ఆది దంపతులు

ఘనంగా ప్రారంభమైన స్వర్ణరథం సేవలు





రథంపై ఉత్సవమూర్తులు

శ్రీశైలం, ఫిబ్రవరి 16: సకల లోకాలకు ఆదిదంపతులైన శివపార్వతులు స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. నెల్లూరు జిల్లాకు చెందిన రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు సమర్పించిన స్వర్ణరథాన్ని శుక్రవారం ఉదయం ఆలయ అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. ముందుగా స్వర్ణరథానికి సంప్రోక్షణ, పూజాదికాలను నిర్వహించారు. అనంతరం ప్రధాన ఆలయం రాజగోపురం నుంచి నందిగుడి వరకు అక్కడి నుంచి ప్రధానాలయం వరకు స్వర్ణ రథసేవను నిర్వహించారు. స్వర్ణరథం ఎదుట మహిళల కోలాటల ప్రదర్శన ఆకట్టుకుంది. కోలాహలంగా సాగిన స్వర్ణరథంపై దర్శనమిచ్చిన స్వామి, అమ్మవార్లను భక్తులు కనులారా వీక్షించారు. ఈ బంగారు రథం విలువ రూ.11 కోట్లు ఉంటుందని సమాచారం. సుమారు 23.6 అడుగుల ఎత్తుతో తయారు చేసిన స్వర్ణరథం మధ్యలో పార్వతీ పరమేశ్వరులు, గణపతి, కుమారస్వామి, దిగువ భాగంలో బ్రహ్మ మూర్తులను చెక్కారు. స్వామి, అమ్మవార్ల చుట్టూ అష్టదిక్పాలకులు, ముందు భాగంలో స్వారీ చేస్తున్న రెండు పెద్ద అశ్వాలు, ఎనిమిది నందులు, వినాయకుడు, దక్షిణామూర్తి, విష్ణుదుర్గ, లింగోద్భవ శివుడు ఉన్నారు. ఇప్పటి వరకు ప్రతి సోమవారం స్వామి, అమ్మవార్లకు వెండి రథోత్సవాన్ని నిర్వహించేవారు. అయితే తొలిసారిగా స్వర్ణరథంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

మహా కుంభాభిషేకం వేడుకలు ప్రారంభం

- శ్రీశైలానికి తరలివచ్చిన భక్తులు
- తొలి రోజు ఫలపుష్పాలతో ఆలయ ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం
- 21 వరకు కొనసాగనున్న మహోత్సవాలు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు



యాగశాలలో మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, ఫిబ్రవరి 16: లోక కల్యాణార్థం తలపెట్టిన మహా కుంభాభిషేకం మహోత్సవాలు శ్రీశైలం మల్లన్న ఆలయంలో శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ మహోత్సవానికి శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి హాజరయ్యారు. అదేవిధంగా డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు ఈ మహాకుంభాభిషేక మహోత్సవం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మహాకుంభాభిషేకం మహోత్సవాన్ని ఈ నెల 21వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆరు రోజులపాటు జరిగే మహోత్సవంలో చివరి రోజున ఆలయంలో శివాజీ గోపురానికి స్వర్ణకలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో పుణరుద్ధరించిన ఉప ఆలయాలు, పంచమఠాలలోని మూడు మఠాలలో శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను శాస్త్రానుసారంగా చేయనున్నారు. మహాకుంభాభిషేకం ఉత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి, జప, పారాయణ, ధ్యాన, హోమాదులను చేపడుతారు. ఆ మంత్రపూజిత జలాలతో ఆలయంలోని గర్భాలయ విమానాలను, గోపురాలను, దేవతామూర్తులను అభిషేకిస్తారు. మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్లకు ప్రతి రోజూ విశేష పూజలు, జపాలు, పారాయణాలు నిర్వహిస్తున్నారు.

మొదటి రోజు ఇలా...

కుంభాభిషేకం మహోత్సవంలో మొదటి రోజు ఉదయం దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, ఫలపుష్పాదులతో ఆలయ ప్రదక్షిణ చేసి యాగశాల ప్రవేశం చేశారు. అనంతరం మహాగణపతిస్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఋత్విగ్వరణం, దీక్షాధారణ, పంచగవ్యప్రాశన, మండపారాధనలు, అఖండదీపస్థాపన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, అగ్నిమంధనం, అగ్నిప్రతిష్ఠాపన, జలాధివాసం తదితర కార్యక్రమాలను నిర్వహించారు.



మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి

బీజేపీని గద్దె దింపుదాం

- కార్మిక సంఘాల పిలుపు



నంద్యాలలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సభలో ప్రసంగిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 16: ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్న బీజేపీని గద్దె దింపాలని కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని కార్మిక సంఘాలు బంద్‌లో పాల్గొన్నాయి. నంద్యాలలోని టెక్కె మార్కెట్‌యార్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన, బైక్, ఆటో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ సర్కిల్‌లో సభను ఏర్పాటు చేశారు. సీఐటీయూ అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, మహమ్మద్ గౌస్, పుల్లా నరసింహ, అంగన్‌వాడీ, ఆటో యూనియన్, ఆర్‌పీఆర్‌ఎస్ వ్యవసాయ కూలీల సంఘం నాయకులు ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ రైతులను, కార్మికులను బానిసలుగా చేసే చట్టాలను రూపొందించిందన్నారు. వాటిపై ఢిల్లీలో ఉద్యమిస్తున్న రైతుల మీద నిర్బంధం ప్రయోగిస్తున్నారని అన్నారు.

ఓట్ల లెక్కింపు కేంద్రాలపై ప్రతిపాదనలు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 16: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఓట్ల లెక్కింపు కేంద్రాలపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపుతామని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్‌రూములు, రిసెప్షన్ సెంటర్ల నిర్వహణ తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదిత్యా.. నమోస్తుతే

- ఘనంగా రథసప్తమి వేడుకలు
- గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రత్యేక పూజలు



కర్నూలు నగరంలోని సూర్యభగవానుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దత్త పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద స్వామిజీ

కల్లూరు, ఫిబ్రవరి 16: యావత్ దేవతలు కొలిచే రూపం..సమస్త లోకాలకు వెలుగునిచ్చే తేజోమయ స్వరూపం సూర్యనారాయణుడు. రథసప్తమి నాడు స్వామి స్వామివారు అలంకరణ లేకుండా నిజరూపదర్శనమిచ్చారు. ప్రత్యక్షదైవం సూర్యభగవానుడి జయంతి వేడుకలు శుక్రవారం నగరంలోని శ్రీసూర్యనారాయణస్వామి ఆలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తెల్లవారు జామునుంచే స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. పూజల్లో పాల్గొన్న భక్తులు స్వామివారికి అభిషేకాలు, అరుణహోమాలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు.

● భక్తిశ్రద్ధలతో నివేదనలు:

సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు, ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ వేడుకలకు దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామిజీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తమి ఘడియల్లో సూర్యోదయాన మహిళలు పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి నివేదించారు. మహాసౌరయాగం, సూర్య భగవాణుడికి హారతులు ఇచ్చారు. . సప్తమి బ్రాహ్మ ముహూర్తంలో స్వామీజీ రథసప్తమి వ్రతం నిర్వహించారు. శుక్రవారం ఉదయం సూర్యోదయ సమయాన సూర్యుడికి ఆవుపాలు, కొత్తబియ్యం, కొత్తబెల్లంతో తయారుచేసిన క్షీరాన్నం నైవేద్యంగా సమర్పించారు. మూలవిరాట్టుకు దత్తవిజయానంద తీర్థ స్వామిజీ అభిషేకం అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ప్రసాద పంపిణీ, అన్నదాన ప్రసాద వితరణ నిర్వహించారు.

నదుల్లో, వాగుల్లో ఇసుక తవ్వాలంటే పర్యావరణ అనుమతులు ఉండాలి. ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా ఇసుక తవ్వడానికి వీల్లేదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయినా అక్రమార్కులు తుంగభద్రను తోడేస్తున్నారు. అధికారం మాటున అక్రమార్కులు నిబంధనలు తుంగలో కలిపేసి అక్రమంగా ఇసుక తవ్వి రవాణా చేస్తున్నారు. గుడికంబాలి-1, 3 రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఉంటే.. ఆ ముసుగులో నదిలో ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వాళ్లు అధికార వైసీపీ నాయకులకు భయపడుతున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక అక్రమార్కుల తీరుపై ఆంధ్రజ్యోతి గతంలో పలు కథనాలు ప్రచురించింది. గుడికంబాలి, మరళి రీచ్‌లను పరిశీలించిన ఆదోని సబ్ కలెక్టరు శివనారాయణస్వామి ఆధ్వర్యంలోని కమిటీ తన నివేదికలో ఇసుక అక్రమాలు నిజమే అని నిగ్గు తేల్చింది. దీన్ని కలెక్టరు డాక్టరు జి.సృజనకు పంపించారు. ఇప్పటికైనా ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా..? లేక ఈ నివేదిక కూడా చెత్తబుట్టలోకి వెళ్తుందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నదిని తవ్వేస్తున్నారు

- నిబంధనలకు విరుద్ధంగా తుంగభద్రలోంచి ఇసుక రవాణా
- ఇసుక రీచుల్లో అక్రమాలు నిజమే
- నిగ్గు తేల్చిన ఆదోని సబ్ కలెక్టరు కమిటీ



కైతాళంలో ఇసుక తవ్వకాలను అడ్డుకుంటున్న అధికారులు

కర్నూలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం కౌతాళం మండలం గుడికంబాలి-1,2,3, మరళి-1,2, నందవరం మండలం నాగులదిన్నె-1 ఓపన్ రీచులు ఉన్నాయి. అలాగే సి. బెళగల్ మండలం కొత్తకోట, కె. సింగవరం, పల్లె దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల వద్ద మరో నాలుగు డీ సిల్టేషన్ రీచులను (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) గనులు భూగర్భ వనరుల శాఖ గుర్తించింది. ఇసుక తవ్వకాలు, రవాణా కోసం జేపీ పవర్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల లీజుకు అనుమతి ఇచ్చింది. ఈ లీజు గడువు గత ఏడాది మే 15న ముగిసినా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగించారు. ఇటీవలే సీఎం జగన్ సోదరుడికి చెందిన మరో కంపెనీకి అనుమతులు ఇచ్చారు. అయితే.. పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేపట్టవద్దని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) గత జూన్ 2న ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అంతేకాదు.. పర్యావరణ అనుమతులు (ఈసీ)తో పాటు భారత ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) నుంచి ఎన్‌వోసీ లేకుండా రీచ్‌లలో ఇసుక తవ్వకాలు చేపట్టరాదని ఏపీ ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు కూడా జారీ చేసింది. గుడికంబాలి-1,3 రెండు రీచ్‌లకు మాత్రమే పర్యావరణ (ఈసీ) అనుమతులు ఉన్నాయని మైనింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఆ ముసుగులో అధికారం మాటున వైసీపీ నాయకులు పెట్రేగిపోతున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి తుంగభద్రలో భారీ యంత్రాలు పెట్టి ఇసుకను ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు. ఇసుక రీచ్‌లో పెత్తనం ఇసుక అక్రమార్కుల తీరుపై ఆంధ్రజ్యోతి పలు కథనాలు ద్వారా వెలుగులోకి తెచ్చింది. కలెక్టరు డాక్టర్ జి.సృజన స్పందించారు. ఆదోని సబ్ కలెక్టరు నారాయణస్వామి నేతృత్వంతో విచారణకు ఆదేశించారు.

● రీచ్‌లను తనిఖీ చేసిన కమిటీ

చెన్నైకు చెందిన సౌత్ జోన్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు, కలెక్టరు డాక్టర్ జి.సృజన సూచనలు మేరకు ఆదోని సబ్ కలెక్టరు శివనారాయణస్వామి, గనులు భూగర్భ వనరులు శాఖ (మైనింగ్) డీడీ రాజశేఖర్, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ, కౌతాళం తహసీల్దారు సహా సర్వే, రెవిన్యూ సిబ్బంది బృందం కౌతాళం మండలం గుడికంబాలి-1, గుడికంబాలి-2, గుడికంబాలి-3, మరళి-1, మరళి-2 ఇసుక రీచ్‌లను ఉంటే.. ప్రధానంగా గుడికంబాలి-3, మరళి-1, 2 రీచ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్రంగా తనిఖీ చేశారు. తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు నిజమేనని విచారణ నివేదికను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ స్వామి కలెక్టర్ డాక్టర్ జి. సృజనకు ఈ నెల 13న అందజేశారు. రీచ్‌లు గుర్తించని ప్రాంతాల్లో కూడా తుంగభద్ర ఇసుకను అడ్డంగా తవ్వేసినట్లు వారు గుర్తించారు.

ఆ నివేదికలో ఏముంది..!

- మరళి-1, 2 రీచ్‌లు తనిఖీ చేయగా.. గ్రామం నుంచి తుంగభద్ర నదిలో ఇసుక రీచ్‌లకు వెళ్లేందుకు రహదారిని ఏర్పాటు చేశారు. ఆ దారి గుండా వాహనాలు రాకపోకలు సాగించినట్లు టైర్ల గుర్తులు స్పష్టంగా ఉన్నాయి. నదిలో ప్రధాన రీచ్‌కు వాహనాలు వెళ్లకుండా రహదారికి అడ్డంగా కందకం (గుంత) తవ్వినట్లు గుర్తించారు.
- మరళి-1 రీచ్‌ను తనిఖీ చేయగా చైన్ మౌంటెడ్ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు రాకపోకలు సాగించాయి. ఆ గుర్తులు స్పష్టంగా ఉన్నాయి. ఎక్స్‌కవేటర్లు, టిప్పర్లు రాకపోకలు సాగించినట్లు టైర్ల గుర్తులు పరిశీలిస్తే తాజాగా (విచారణ కమిటీ రావడానికి ముందు రోజు లేదా అదే రోజు ఉదయం) ఇసుక తవ్వకాలు, రవాణా చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. అక్రమ మైనింగ్ వల్ల స్థానిక నివాసాల విధ్వంసం, నీటి కాలుష్యం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడానికి కారణం అవుతుందని తెలుస్తుంది.
- తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తున్నట్లు గుర్తించారు.
- మరళి-2 ఇసుక రీచ్‌కు సమీపంలోని నాన్ నోటిఫైడ్ ప్రాంతం (ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వని ప్రాంతం)లో అక్రమంగా ఇసుక తవ్వుతున్నట్లు గుర్తించారు. టాటా హిటాచీ ఎక్స్ 200 చైన్ మౌంటెడ్ ఎక్స్‌కవేటర్, టిప్పర్ ద్వారా నది వెంబడి అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. తనిఖీ బృందం అక్కడి చేరుకునేలోగా టిప్పర్‌తో సహా డ్రైవర్ పారిపోగా.. హిటాచీ ఆపరేటర్ ఎక్స్‌కవేటర్‌కు తాళం వేసి అక్కడి నుంచి నుంచి తప్పుకున్నాడు.
- కౌతాళం మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, మైనింగ్ డీడీ, కాలుష్య నియంత్రణ మండలి ఏఈలు స్థానిక గ్రామస్థుల సమక్షంలో పంచనామా నిర్వహించారు. తుంగభద్ర నదిలో అక్రమ మైనింగ్‌కు ఉపయోగించిన టాటా హిటాచీ ఎక్స్‌కవేటర్‌ను ఎమ్మిగనూరు డీఎస్పీకి అప్పగించారు. ఇతర సామగ్రిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. హిటాచీ ఎక్స్‌కవేటర్ వివరాలు సేకరించి పోలీసులకు సహకరించాలని ఆదోని ప్రాంతీయ రవాణా అధికారి (ఎంవీఐ)కు ఆదేశించారు.



- తుంగభద్ర నదిలో 2 మీటర్లకు పైగా లోతులో ఇసుక తవ్వకాలు చేసినట్లు, ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు ఉపయోగించిన చైన్ మౌంటెడ్ ఎక్స్‌కవేటర్లు, టిప్పర్ల టైర్లు గుర్తులు స్పష్టంగా ఉన్నాయి, తనిఖీకి రావడానికి ముందే ఈ వాహనాలు కాకపోకలు సాగించినట్లు విచారణ కమిటీ గుర్తించినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా అనధికారికంగా బోర్లు తవ్వి అక్రమంగా నీటిని పంపింగ్ చేస్తున్నట్లు గుర్తించారు.
- తనిఖీలో గుర్తించిన ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వివరాలు సహా అందుకు సాక్ష్యంగా ఫొటోలతో పాటు ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ స్వామి సమగ్ర నివేదికను కలెక్టర్ డాక్టర్ జి. సృజనకు పంపించారు.

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకుంటారా..?

మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, ఆయన ముఖ్య అనుచరులు, అధికార వైసీపీ కీలక నాయకుల ఆజ్ఞ లేనిదే పిడికెడు ఇసుక కూడా రీచ్‌లను దాటి బయటకు రాదని స్థానికులు అంటున్నారు. తుంగభద్ర ఒడ్డునే నది ఆధారంగా జీవిస్తున్న గుడికంబాలి, మరళి, కుంబళనూరు, మేళిగనూరు వంటి గ్రామాల ప్రజలు కూడా గంపెడు ఇసుక కావాలన్నా ఇసుక అక్రమార్కులకు డబ్బులు చెల్లించాల్సిందే. అధికారం అడ్డం పెట్టుకొని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా ఏ స్థాయిలో జరుగుతుందో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ శివనారాయణస్వామి బృందమే నిగ్గు తేల్చింది. అక్రమ ఇసుక తవ్వకాలకు ఉపయోగించిన హిటాచీ ఎక్స్‌కవేటర్‌ను సంఘటన స్థలంలోనే స్వాధీనం చేసుకున్నారు. అది ఎవరిది..? ఎవరు తీసుకొచ్చారు..? ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తుంది ఎవరు..? అని విచారిస్తే అక్రమార్కుల గుట్టురట్టు అవుతుంది. ఈ దిశగా చర్యలు తీసుకుంటారా..? లేక అన్నీ నివేదికలులాగే దీన్నీ బుట్టదాఖలు చేస్తారా..? అసలైన అక్రమ మైనింగ్‌దారులను వదిలేసి అమాయకులపై కేసులు పెట్టి చేతులు దులుపుకుంటారా..? అని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల ఏర్పాటు

- పరిశీలించిన కలెక్టర్ డా.జి. సృజన



సిల్వర్‌జూబ్లీ కళాశాల, ఔట్‌డోర్ స్టేడియంలో కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: రానున్న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామగ్రిని పంపిణీ చేయడానికి ఏర్పాటు చేసిన కేంద్రాలను ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.జి. సృజన పరిశీలించారు. శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న కోడుమూరు, కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేయనున్న కర్నూలు నియోజకవర్గాల ఎన్నికల సామగ్రి డిస్పాచ్ సెంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొదట దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని పంపించేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు, కోడుమూరు రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. పోలింగ్ మెటీరియల్ స్ట్రాంగ్ రూమ్ నుంచి తీసుకుని రావడానికి, పోలింగ్ సిబ్బందిని, ఎన్నికల సామగ్రితో బస్సు ఎక్కించేందుకు అవసరమైన సెక్యూరిటీ సిబ్బందిని ఎస్పీతో మాట్లాడి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎన్నికల సామగ్రి రూమ్‌లో పెట్టిన తర్వాత ఎవరూ ప్రవేశించకుండా సీలింగ్ చేయాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే సమయంలో ఇతరులు లోపలికి రాకుండా మెయిన్ ఎంట్రన్స్ గేటు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి కేవలం పోలింగ్ సామగ్రితో సిబ్బంది వెళ్లే బస్సులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. దీనికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల రూట్ మ్యాప్‌లలో బస్సులకు నెంబర్ ఇవ్వాలని రిటర్నింగ్ అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, డీఆర్వో మధుసూదన్‌రావు, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, ఫిబ్రవరి 16: మంత్రాలయం సమీపంలోని గోశాల సమీపంలో భారీగా కర్ణాటక మద్యాన్ని పోలీసులు గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం కర్ణాటక నుంచి కారులో 17 బాక్సుల్లోని 1,632 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా మంత్రాలయం సీఐ ఎరిషావలి, ఎస్ఐ వేణుగోపాల్‌రాజు దాడులు చేసి పట్టుకున్నారు. మద్యాన్ని తరలిస్తున్న దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామానికి చెందిన అగ్రహారం చెన్నకేశవులు, కర్ణాటకలోని రాయచూరు జిల్లా గిలకసూగురు చెందిన వెంకటేశ్‌లపై కేసు నమోదు చేశారు. వీరిలో వెంకటేశ్ పరారీలో ఉండగా చెన్నకేశవులును అరెస్టు చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కర్ణాటక మద్యంతో పాటు కారును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఏఎస్ఐ ఆనందరెడ్డి, క్రిష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలపై డీఆర్వో సమీక్ష

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) మధుసూదన్‌రావు అధికారులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు, మార్చి 18 నుంచి 27 వరకు పది, ఇంటర్ ఓపెన్ పరీక్షలకు, మార్చి 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ ఓపెన్ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. డీఈఓ శ్యాముల్ మాట్లాడుతూ జిల్లాలో 162 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 37,801మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు.

పత్తి ధర క్వింటా రూ.7351

- క్వింటానికి రూ.300 పైగా పెరిగిన ధర

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 16: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర స్వల్పంగా పెరిగింది. రెండు నెలల తర్వాత శుక్రవారం క్వింటానికి పత్తి ధర రూ.300 పెరిగి గరిష్ఠంగా రూ.7,351 పలికింది. గ్రామాల్లో చాలా మంది రైతులు ధరలు పెరుగుతాయని ఆశించి పత్తిని ఇళ్లలో నిలువ చేసుకున్నారు. క్వింటం పత్తి ధర రూ.7 వేలకు మించి పలకపోవడంతో గిట్టుబాటు కాక రైతులు ధర పెరుగుతుందని ఆశించి నిలువ చేస్తున్నారు. ధరలు స్వల్పంగానైనా పెరుగుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. క్వింటం పత్తి రూ.10 వేలకు పైగా పెరిగితే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 16 : ఆత్మకూరు పట్టణ శివార్లలోని సిద్ధపల్లె రస్తా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్ అమీర్ (74) మృతి చెందాడు. ఆత్మకూరు పట్టణంలోని నీలి తొట్ల వీధికి చెందిన సయ్యద్ అమీర్ సిద్ధపల్లె రస్తాలోని క్రాసింగ్ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా, ఆటోలో వెంకటాపురం నుండి నాగరాజు అనే వ్యక్తి పాములపాడుకు పాలు అమ్మేందుకు వెళుతూ ప్రమాదవశాత్తు సయ్యద్ అమీర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన సయ్యద్ అమీర్‌ను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. చికిత్స పొందుతూ సయ్యద్ అమీర్ మృతి చెందాడు. అమీర్ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నారాయణ రెడ్డి తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

డోన్(రూరల్), ఫిబ్రవరి 16: డోన్ పట్టణంలోని ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో నివాసముంటున్న ఆటో డ్రైవర్ బద్రి కుమార్తె లక్ష్మి ప్రియాంక (13) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటోంది. సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తోందని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురైన ప్రియాంక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కర్ తెలిపారు.

గుండెపోటుతో యువ వైద్యుడి మృతి

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 16: కర్నూలు నగరం ముజఫర్‌నగర్‌కు చెందిన అనస్థీషియా వైద్యుడు డా.శ్రవణ్ (36) గుండెపోటుతో శుక్రవారం తెల్లవారుజామున ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో మృతి చెందారు. మత్తు మందు వైద్యుడిగా పేరున్న డా. శ్రవణ్ 2006లో కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్యవిద్యను పూర్తి చేసి, ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో అనస్థీషియా వైద్యుడిగా పని చేస్తున్నారు. ఆయన గురువారం రాత్రంతా నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఓ రోగి కేర్ కోసం ఉన్నారు. తెల్లవారుజాము గుండెపోటు వచ్చి కోలుకోలేక మృతి చెందారు. తీవ్ర ఒత్తిడి కారణంగా ఆయన మృతి చెందినట్లు తెలిసింది. డాక్టర్ భార్య కూడా డెంటల్ వైద్యురాలిగా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అనస్థీషియా వైద్యుడు శ్రవణ్ (ఫైల్)

శ్రీమఠానికి రూ. 1.50 లక్షల విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 16. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన మురళీధర్ అనే భక్తుడు గోశాలకు రూ.లక్ష, యుఎస్ఏకు చెందిన జ్యోతి అనే భక్తురాలు అన్నదానానికి రూ. 50 వేలు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు. శుక్రవారం వేర్వేరు సమయాల్లో వారు కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాతలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు 91 మంది గైర్హాజర్

కర్నూలు(ఎడ్యుకేషన్),ఫిబ్రవరి 16: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్స్ ప్రాక్టికల్స్ పరీక్షలకు శుక్రవారం 91 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు. జిల్లాలో మొత్తం 3,409 మందికి గాను, 3354 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన సెషన్స్‌లో 1822 మందికి గాను 1785 మంది హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెషన్స్‌లో 1587 మందికి గాను 1569 మంది హాజరయ్యారని ఆర్ఐవో తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలను డీఈసీ కమిటీ సభ్యులు ఆర్ఐవో, డీవీఈవో, స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించినట్లు ఆయన వివరించారు.

కిడ్నీ మార్పిడి సక్సెస్

- కర్నూలు జీజీహెచ్‌లో రెండు అరుదైన ఆపరేషన్లు
- బ్రెయిన్ డెడ్ మహిళ నుంచి కిడ్నీ సేకరణ
- కడప వాసికి అమర్చిన వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 16: కర్నూలు సర్వజన వైద్యశాలలో ఇద్దరు రోగులకు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు విజయవంతమయ్యాయి. సి.బెళగల్‌కు చెందిన 26 ఏళ్ల ఈరన్నకు తన తల్లి ఈరమ్మ దానం చేసిన కిడ్నీని జనవరి 29న వైద్యులు కిడ్నీని అమర్చారు. అలాగే ఈ నెల 6వ తేదీన బ్రెయిన్‌డెడ్ అయిన పావనీలత నుంచి సేకరించిన కిడ్నీని కడప నగరానికి చెందిన 44 ఏళ్ల ఎస్తేర్ రాణికి కిడ్నీని అమర్చారు. పది రోజుల్లో రెండు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరగడం ఆసుపత్రి చరిత్రలో ప్రప్రథమం. ఇద్దరు రోగులు ఆరోగ్యంతో కోలుకుని శుక్రవారం డిశ్చార్జ్ అయ్యారని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంటరంగారెడ్డి తెలిపారు.



కిడ్నీ మార్పిడి చేసుకున్న రోగులతో వైద్యులు



సి.బెళగల్‌కు చెందిన ఈరన్న (26) గత ఆరేళ్ల నుంచి కిడ్నీ జబ్బుతో బాధపడుతున్నారు. డయాలసిస్ చేయించుకుంటున్నారు. వారానికి రెండుసార్లు కీమో డయాలసిస్ చేయించుకుంటున్నారు. యువకుడు కాబట్టి రోగికి అతని తల్లిదండ్రులకు కిడ్నీ మార్పిడి కోసం యూరాలజీ, నెఫ్రాలజీ వైద్యులు కౌన్సెలింగ్ ఇచ్చారు. చివరకు ఈరన్న తల్లి ఈరమ్మ కిడ్నీ దానం చేయడంతో యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య నేతృత్వంలో జనవరి 29న కిడ్నీ మార్పిడి చేశారు.



ఎస్తేర్ రాణి (44) కడప నగరంలోని ప్రకాష్‌నగర్‌లో ఉంటోంది. 4 సంవత్సరాల నుంచి ఆమె సీకేడీతో బాధపడుతుంది. డయాలసిస్‌తో నరకయాతన అనుభవించేది. కిడ్నీ మార్పిడి కోసం ఆమె కుటుంబ సభ్యులకు వైద్యులు కౌన్సిలింగ్ ఇచ్చారు. జీవన్‌దాన్‌లో ఆమె రిజిస్ట్రేషన్ చేసుకుని జనవరి 5న కర్నూలు జీజీహెచ్‌లో అడ్మిషన్ పొందారు. 6వ తేదీ కర్నూలుకు చెందిన పావనీలత బ్రెయిన్‌డెడ్ అయింది. దీంతో తల్లిదండ్రులు అవయవదానం ఇచ్చేందుకు ముందుకు రావడంతో డాక్టర్ సీతారామయ్య పావనీలత నుంచి కిడ్నీని సేకరించి, అదే రోజు ఎస్తేర్ రాణికి అమర్చారు.

ప్రాణం పోసిన పావనీలత

ఇటీవల బ్రెయిన్‌డెడ్ అయిన పావనీలత అవయవదానం వల్ల నలుగురికి పునర్జన్మ కలిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.వెంకటరంగారెడ్డి అన్నారు. పావనీలత అవయవదానం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మొట్టమొదటసారిగా కేడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం కర్నూలు జీజీహెచ్‌కే దక్కుతుందన్నారు. ఆసుపత్రిలో అరుదైన సర్జరీ చేయడానికి నిపుణులైన వైద్యుల బృందం ఇక్కడ ఉందని కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసిన యూరాలజీ, నెఫ్రాలజీ, అనస్థీషియా కోఆర్డినేటర్లు, నర్సింగ్ సిబ్బందికి రెడ్‌క్రాస్ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పది రోజుల్లో రెండు కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ చింతా ప్రభాకర్ రెడ్డి, కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ సీతారామయ్య, నెఫ్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అనంత్, వైద్య కళాశాల అధ్యాపకులు కొండారెడ్డి, మాత్యశ్రీ, రాజారెడ్డి, రవితేజ, మహేష్, రాజశేఖర్, వెంకట పక్కీరెడ్డి, శ్రీధర్, జీవన్‌దాన్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పెద్దవంగలిలో పండ్ల తోటల దగ్ధం

చాగలమర్రి, ఫిబ్రవరి 16: మండలంలోని పెద్దవంగలి గ్రామంలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో రైతులు హరికృష్ణ, ఉమామహేశ్వరి, భారతి, వీరమ్మ సాగు చేసిన మామిడి, నేరేడు, సపోటా, ఖర్జూరం తోటలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. తోటలు దగ్ధమై రైతులకు నష్టం వాటిల్లింది. రైతు హరికృష్ణ సాగు చేసిన 4 ఎకరాల్లో మామిడి, ఉమామహేశ్వరి సాగు చేసిన 4 ఎకరాల్లో ఖర్జూరం, వీరయ్య సాగు చేసిన 3 ఎకరాల్లో సపోటా, నేరేడు, భారతి సాగు 4 ఎకరాల్లో మామిడి, సపోటా తోటలు దగ్ధమయ్యాయి. చెట్లకు నీరు కట్టుకునేందుకు ఏర్పాటు చేసిన 300 నీటి పైపులు కాలి బూడిదయ్యాయి. రూ.15 లక్షలు దాక రైతులకు నష్టం వాటిల్లింది. ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. పండ్ల తోటల బీమా పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

మార్చి 3న పల్స్ పోలియో

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 16: మార్చి 3న జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జి.సృజన, డీఆర్వో మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయండి

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఎన్నికలకు సన్నద్ధతపై కర్నూలు కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సమావేశం నిర్వహించారు. ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ సరిహద్దులలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులే కాక మైనర్ రూట్స్‌లో కూడా భద్రతా పరమైన చర్యలు తీసుకోవడానికి గానూ సరిహద్దు జిల్లాల అధికారులతో సమావేశం నిర్వహించుకోవాలని ఎస్పీని ఆదేశించారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

బంద్ ప్రశాంతం



నందికొట్కూరులో రాస్తారోకో


పాములపాడులో ధర్నా


జూపాడుబంగ్లాలో..


గడివేములలో..

ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన బంద్ శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ప్రజా, కార్మిక, రైతు సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు. వివిధ రూపాల్లో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరించివేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నదని ఆరోపించారు.


ఆత్మకూరులో..


ఆత్మకూరు (రూరల్): ఆత్మకూరులో మద్దతు తెలుపుతున్న బీమా ఉద్యోగుల సంఘం నాయకులు



వెలుగోడులో..


బండిఆత్మకూరులో..


గోస్పాడులో..



పాణ్యంలో..

మున్సిపల్ స్థలాన్ని కాపాడాలి

● మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి


కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

నంద్యాల (టౌన్/నూనెపల్లె), ఫిబ్రవరి 16: నంద్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో ఉన్న 2313/1సీ సర్వేనంబరు పేరుతో కబ్జాకు గురైన 2.60 ఎకరాల మున్సిపల్ స్థలాన్ని కాపాడాలని మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని కలిసి మున్సిపల్ స్థలం అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేసి వినతిపత్రాన్ని అందజేశారు. బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ స్థలం అని తెలిసీ కూడా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని ప్రశ్నించారు. వీటిని వెంటనే నిలిపివేసేలా పురపాలక శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహబూబ్‌వలి, కౌన్సిలర్ నాగార్జున, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభం

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 16: నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల, శిరివెళ్ల మండల కేంద్రాల్లో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలను ప్రారంభించినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు డిజిటల్ లావాదేవీలతో పాటు సైబర్ నేరాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు పూర్తి అవగాహన కల్పించటానికి ఈ కేంద్రాలను ప్రారంభించినట్లు పీడీ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ నరసింహారావు, జిల్లా లీడ్ మేనేజర్ రవీంద్రకుమార్, బ్యాంక్ లింకేజి కో ఆర్డినేటర్ యల్లయ్య, శిరివెళ్ల మండలం ఏపీఎం పుణ్యవతి శిరివెళ్ల సీసీలు పాల్గొన్నారు.

'సంస్కారం అవసరం'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 16: విద్యార్థులకు చదువుతో పాటు, సభ్యత, సంస్కారాలు ముఖ్యమని అంతర్జాతీయ విశ్వహిందూ పరిషత్ మాజీ అధ్యక్షుడు జి. రాఘవ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మహానంది రోడ్డులో ఉన్న ఎయిమ్ ఫర్ సేవా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం నిర్వహిస్తున్న పాఠశాలను సందర్శించారు. అక్కడ చదువుతున్న విద్యార్థినులకు క్యారం బోర్డు, చెస్ బోర్డులతో పాటు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. పాఠశాలకు అవసరమైన ప్రహరి గోడను కట్టిస్తానని హామీ ఇచ్చారు. రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డా. రామకృష్ణా రెడ్డి, మోక్షేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

'బకాయిలు చెల్లించాలి'

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 16: రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు రావాల్సిన రూ.22 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్‌టీయూఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నంద్యాలలోని కార్యాలయంలో వారు మాట్లాడారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాము, నాయకులు నాగరాజు, బాబాఫక్రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు చేపట్టిన నిరసనలు మూడో రోజైన శుక్రవారం కొనసాగాయి. ఇందులో భాగంగా వారు మధ్యాహ్న విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏపీజేఏసీ చైర్మన్ సి. మోహన్‌రెడ్డి, ఏపీఎన్జీవోస్ తాలుకా కార్యదర్శి సాజిద్‌బాషా, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు షఫీవుల్లా, కలీముల్లా, విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షుడు అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

'రైతు సంఘాలు బలోపేతం కావాలి'

మహానంది, ఫిబ్రవరి 16: జిల్లాలోని రైతు సంఘాలు బలోపేతం కావడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచుకోవాలని నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బుక్కాపురం గ్రామంలో శుక్రవారం నాబార్డు ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల సిబ్బందితో పాటు రైతు ఉత్పత్తి దారుల సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నవయూత్ అసోసియేషన్, అపార్డ్, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది, ప్యాపిలి, తుగ్గలి, నందికొట్కూరు, గడివేముల, మహానంది, డోన్ మండలాల నుంచి ఎఫ్‌పీవోలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలి: డీఈ

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 16: ప్రతి ఇంటికి కొళాయి కార్యక్రమాన్ని పక్కాగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఏఈ లక్ష్మీనరసింహ, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు జలజీవన్ మిషన్ ఒక రోజు శిక్షణా కార్యక్రమం ఎంపీడీవో సగిలి విజయరావు అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం జలజీవన్ మిషన్ జిల్లా డైరెక్టర్ భీమశంకర్‌రెడ్డి కమ్యూనిటీ కాంట్రాక్ట్ పద్ధతిపై వివరించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏవో హనీఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: ఎస్పీ



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 16: జిల్లాలోని పోలీస్ శాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ఎస్పీ రఘువీర్‌రెడ్డి చెప్పారు. నంద్యాలలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌డేను నిర్వహించారు. ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ రిక్వెస్ట్ బదిలీ గురించి ఎస్పీకి విన్నవించారు. సిబ్బంది సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని ఎస్పీ భరోసా కల్పించారు. ఎస్పీ డీఎస్పీ సంతోష్, ఆర్ఎస్ఐ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

'చేతిపంపులకు మరమ్మతులు'

ఆత్మకూరు, ఫిబ్రవరి 16: ఆత్మకూరు పట్టణంలో నెలకొన్న నీటిఎద్దడి నేపథ్యంలో ముమ్మరంగా చేతిపంపులను మరమ్మతులు చేపడుతున్నట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఎంఏ రషీద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పలువార్డుల్లో మరమ్మత్తులకు గురైన చేతిపంపులకు చేపడుతున్న మరమ్మతులను వారు పరిశీలించారు. మాజీ కౌన్సిలర్ తిమోతి, నాయకులు రఫీక్ ఉన్నారు.

వైభవంగా రథసప్తమి


మహానందిలో..

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 16: నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో శుక్రవారం భగవత్ సేవా సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భాగంగా లోక కళ్యాణంకోసం సూర్య ఆరాధన, సూర్య నమస్కారాలు, లక్ష్మీ గణపతి, ధన్వంతరీ, నవగ్రహ, సుదర్శన, అరుణహోమంలు నిర్వహించారు. పూర్ణాహుతి అనంతరం స్వామివారికి దివ్య మంగళ హారతులు సమర్పించి భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మహానంది: మహానంది క్షేత్రంలో వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సమీపంలోని రథశాల వద్దకు మేళతాళాలతో వచ్చారు. అనంతరం రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యునికి ప్రీతిగా సూర్య నమస్కారాలు, తిచ పూజా విధానంలో అర్ఘ్యం, సూర్య యంత్రారాధన చేసి రథాన్ని రథశాల నుంచి బయటకు లాగారు.

నందికొట్కూరు: నందికొట్కూరులోని ఛాయా ఉషా సమేత సూర్యనారాయణస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని ప్రముఖులు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్నవెంకటస్వామి, చెరకుచర్ల రఘురామయ్య, మహేష్ నాయుడు వేర్వేరుగా స్వామిని దర్శించుకున్నారు.

కొత్తపల్లి: కొలనుభారతి పుణ్యక్షేత్రంలో రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని ఈవో మోహన్ ఆదేశాల మేరకు పురోహితులు ప్రాతఃకాల సమయంలోనే సరస్వతి అమ్మవారిని చారుఘోషిని నదిజలాలచే అభిషేకించారు. అనంతరం పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, పుష్పార్చన మహా మంగళ హారతి తదితర విశేష పూజాది క్రతువులు నిర్వహించారు. నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షర, బీజాక్షర క్రతువులు చేయించుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆర్యవైశ్య కాశిరెడ్డినాయన ఆశ్రమ కమిటీ నిర్వహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.


నందికొట్కూరు సూర్యనారాయణ దేవాలయంలో పూజలు చేస్తున్న మాండ్ర శివానందరెడ్డి


నంద్యాలలో పూర్ణాహుతి


ఆత్మకూరులో రథోత్సవం

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర ఆలయంలో రథోత్సవ క్రతువు అత్యంత వైభవోపేతంగా కొనసాగింది. ముందుగా ఆలయంలోని వేంకటేశ్వరస్వామి అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, ఆరాధన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. మధ్యాహ్న సమయంలో దారురథంలో భూనీలా సహిత వేంకటేశ్వర స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో పాటు సూర్యభగవానుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి అశ్వరథ కార్యక్రమాన్ని జరిపారు. ఆలయం చుట్టూ.. ఏడు సార్లు తిరిగి ఉత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవరపల్లి అనిల్‌కుమార్, శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రామయ్య ఉన్నారు.

టీడీపీలో చేరిక


వేల్పనూరులో బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వెలుగోడు, ఫిబ్రవరి 16: వెలుగోడు మండలంలోని వేల్పనూరు గ్రామంలో శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో చిన్న దేవలాపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి తెల్లపూరి నారయణ, పసుపుల మహేశ్, గుండుగారి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, లక్ష్మన్న, శివశంకర్, శివయ్య, రాజు, దాసరిమౌళా, శివక్రిష్ణలతో పాటు యాభై కుటుంబాలు టీడీపీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా బుడ్డా రాజశేఖరరెడ్డి ఆహ్వానించారు.

ఆత్మకూరు: రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌లో రాజధాని అమరావతి కోసం అక్కడి రైతుల అలుపెరుగని పోరాటంపై చిత్రీకరించిన రాజధాని ఫైల్స్ చిత్ర యధార్థ ఘటనలకు నిదర్శనమని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమరావతి రైతల స్ఫూర్తిదాయకమైన పోరాటంపై సినిమా తీస్తే ఏకంగా రాష్ట్ర ప్రభుత్వమే అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కేవలం సీఎం జగన్ కోసమే తీసిన యాత్ర-2 చిత్రాన్ని వైసీపీ నాయకులు ఉచిత ప్రదర్శనలతో నడిపిస్తున్నారని విమర్శించారు.


అల్లూరులో గౌరు సమక్షంలో టీడీపీలో చేరుతున్నవైసీపీ నాయకులు

నందికొట్కూరు రూరల్: అల్లూరులో మాండ్ర నివాసంలో టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో నందికొట్కూరుకు చెందిన పట్టణ వైసీపీ యువకులు టీడీపీ నాయకుడు షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. రెహ్మతుల్లా, మహమ్మద్, ఆరిఫ్, ఇస్మాయిల్, షబ్బీర్, సిద్దూ, ఇమ్రాన్, నాగేశ్వరావు, ఆసిఫ్, బాషా తదితరులు ఉన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ రాజధాని ఫైల్స్ సినిమా విషయంలో ప్రభుత్వం కుట్రలు కోర్టు తీర్పు తో బద్దలయ్యాయని అన్నారు. సినిమా విషయంలో ప్రభుత్వ కుట్రలు కోర్టు తీర్పుతో బద్ధలయ్యాయని అన్నారు.

'జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి'

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 16: జొన్నపంటను మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్‌రెడ్డి వ్యవసాయ అనుబంధరంగాల అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ అధ్యక్షతన, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి తో కలిసి జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ మిడ్తూరు, పాములపాడు, మండలాల్లో త్వరితగతిన జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు అవసరమైన గన్నీ బ్యాగులను కూడా సమకూర్చాలన్నారు. కౌలు రైతులందరికి రుణాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని లీడ్ డిస్ట్రిక్‌మేనేజరును ఆదేశించారు. మిరప పంట కొనుగోలు సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు తెలిసేవిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ మాట్లాడుతూ జొన్నలు కొనుగోలుకు ఎఫ్‌పీవో, డీసీఎంస్, సివిల్ సప్లయిస్, కో-ఆపరేటివ్ మార్క్‌ఫెడ్, తదితర ఏజెన్సీలను బలోపేతం చేసి వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకు 5748మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయఅధికారి మోహన్ రావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

పాములపాడు, ఫిబ్రవరి 16: జగనన్న గోరుముద్ద కార్మికుల వేతనాలు, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, నాణ్యమైన సన్నబియ్యాన్ని సరఫరా చేయాలని సీపీఐ నాయకుడు, ఏపీ మిడ్ డే మీల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. మండలంలోని ఇస్కాల గ్రామంలో శుక్రవారం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు రెండు నెలలుగా బిల్లులు చెల్లించకపోగా మెనూ అమలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పథకాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జయమ్మ, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

పాములపాడు, ఫిబ్రవరి 16: మండలంలోని కేజీ రోడ్డుపై వెళ్తున్న పేదలకు, అనాథలకు రెవెన్యూ డివిజనల్ డిప్యూటీ తహసీల్దార్ కె.అరుణ దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ పాములపాడు మండలంలో పేదలకు, అనాథలకు, వృద్ధులకు, గత 20 సంవత్సరాలుగా తనవంతు మానవత దృక్పథంతో పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

మల్లన్న సన్నిధిలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి

శ్రీశైలం, ఫిబ్రవరి 16: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను శుక్రవారం శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహా స్వామిజీ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న పీఠాధిపతికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అలాగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కమనీయం.. కల్యాణం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 16: నంద్యాల భద్రావతీ భావనారుషి కళ్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం వైభవంగా భద్రావతీ భావనారాయణ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. సాయంకాలం ధ్వజారోహణం, ఉత్సవమూర్తుల గ్రామోత్సవం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పద్మశాలీయ సంఘ కులస్థులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ల తనిఖీ

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 16: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లను కమిషనర్ నిరంజన్‌రెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం ఎంఎస్ నగర్, గాంధీ నగర్, ఎన్‌జీవో కాలనీ, వైఎస్ నగర్, తదితర ప్రాంతాల్లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లను పరిశీలించారు. అలాగే సాయంత్రం లలితా నగర్, గోపాల్ నగర్, దేవనగర్ వార్డుల్లో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'హామీలు అమలు చేయాలి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 16: మున్సిపల్ కార్మికుల సమ్మె హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్నలు పేర్కొన్నారు. ఈమేరకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నందు కోఆప్షన్ సభ్యులు ఎంఏ.రషీద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సీఐటీయు పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, అధ్యక్షులు రజాక్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేంద్ర, జయన్న, సురేష్, రవి, దానమయ్య, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, కుమారీ ఉన్నారు.

నాయకులను తీసుకురావడం సరికాదు: లబ్బి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

కొత్తపల్లి, ఫిబ్రవరి 16: ఎస్సీ నియోజకవర్గాలైన కోడుమూరుకు ప్రకాశం జిల్లాకు చెందిన నాయకున్ని, నందికొట్కూరుకు కడపకు చెందిన ఇంపోర్టెడ్ నాయకులను ప్రభుత్వ నేతలు తీసుకువచ్చి ప్రజల మీద రుద్దడం సరికాదని వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే లబ్బి రథసప్తమిని పురస్కరించుకుని కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం స్థానిక ఆర్యవైశ్య సత్రంలో లబ్బి విలేకరులతో మాట్లాడారు. తన రాజకీయ భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుందన్నారు. ప్రస్తుత రాజకీయాలు వ్యాపార ధోరణిలో నడుస్తున్నాయన్నారు. నియోజక వర్గ అభివృద్ధి కోసం ఎవరైతే పాటుపడుతారో వారికే తన మద్దతు ఉంటుందన్నారు. నాయకులు మహబూబ్ బాషా, మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.

'వైసీపీకి గుణపాఠం తప్పదు'


జూటూరు గ్రామంలో పాల్గొన్న నాయకులు

పాములపాడు, ఫిబ్రవరి 16: వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. శుక్రవారం మండలంలోని జూటూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నాయకులు పూసల కృష్ణ, హఫీజ్, అర్జున్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసిపి పరిపాలనలో దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. నేడు రోడ్లకు గుంతలు పూడ్చే పరిస్థితి కూడా లేదన్నారు. ఉద్యోగులకు జీతాలు రావడం లేదని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేవని, రాష్ట్రానికి పరిశ్రమలు రాక బ్రతుకు తెరువు కోసం ఇతర రాష్ట్రాలకు యువకులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మాండ్ర సురేంద్రనాద్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రవీంద్రనాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, బండ్లమూరి చంద్రశేఖర్, గోవిందు, రామక్రిష్ణ, సన్ని, ఏసేపు, సుంకిరెడ్డి, కరీంబాషా, కలిముల్లా, మనోహర్, బలిజ శ్రీనివాసులు నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రైతులతో చెలగాటమాడుతున్న సీఎం

» రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను అడ్డుకోవడం పిరికి చర్య: మాజీ ఎమ్మెల్యే బీసీ



నందవరంలో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 16: రైతుల జీవితాలతో సీఎం జగన్ చెలగాటం ఆడుతున్నారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం బనగానపల్లె మండలంలోని నందవరం గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీకి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ రాజధాని ఫైల్స్ సినిమా విడుదలను సీఎం జగన్ కుట్రలు పన్ని ఆపివేయాలన్ని ప్రయత్నించారని అన్నారు. అయితే హైకోర్టు సినిమా ప్రదర్శించడానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం సీఎం జగన్‌కు చెంపపెట్టులాంటిదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. 2024లో టీడీపీ, జనసేన పార్టీలు సైకో పాలనకు అంతం పలికి ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బీసీ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో మండల టీడీపీ కన్వీనర్ పీవీ.కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, రమణారెడ్డి, బోయవెంగన్న, చింతమా నుపల్లె నడిపెన్నగారి రామ్మోహన్, బాలవెంకటేశ్వర్లు, బంబులయ్య, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం దివాలా..

» టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 16: వైసీపీ ప్రభుత్వ అసమర్థ విధానాలతో రాష్ట్రం దివాలా తీసిందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం డోన్ మండలంలోని మల్లెంపల్లి గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని మాఫియాలకు అడ్డాగా మార్చేని భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెం డుగా ఉండేవన్నారు. సైకో పాలనలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకుడు కాటమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాద వ్, అభిరెడ్డిపల్లె గోవిందు, జయన్న యాదవ్, ఎల్ఐసీ శ్రీరాములు, మధుసూదన్ రెడ్డి, కొచ్చెర్వు రామాంజనేయులు, బబ్లూ యాదవ్ పాల్గొన్నారు.

చాగలమర్రి: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు అన్నారు. శుక్రవారం చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండు సమీపంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

బేతంచెర్ల, ఫిబ్రవరి 16: రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని నంద్యాల జిల్లా వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు నగేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించకపోతే ఈ నెల 18, 19, 20 తేదీలలో విజయవాడలోని అలంకారి సెంటర్‌లో దీక్షలు చేపడుతామని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ జీవన్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్‌లకు వీఆర్‌ఏలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాముడు, ఎస్‌కే బాషా, రామలక్ష్మి, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ప్రారంభం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 16: కోవెలకుంట్ల పట్టణంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని డీఆర్‌డీఈ ప్రాజెక్టు డెరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజరు రవీంద్రకుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ప్రజలు ఆర్థిక అక్షరాస్యతను పెం చుకోవాలని, ఆర్థిక వ్యవహారాలు, రిజర్వు బ్యాంకు గుర్తించిన ఆర్థిక సంస్థల ద్వారా చేయాలని కోరారు. ఆర్థిక మోసాలు జరిగితే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయులు, ప్రాజెక్టు మేనేజరు అశోక్ కుమార్, కౌన్సిలర్లు ఈశ్వర్‌నాయక్, మహేశ్ పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ నిర్మాణానికి భూమి పూజ

డోన్(రూరల్), ఫిబ్రవరి 16: డోన్ పాతబస్టాండు ప్రధాన రోడ్డులో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరై భూమి పూజలో పాల్గొన్నారు. అనంతరం జర్నలిస్టులు చైర్మన్ సప్తశైల రాజేష్‌ను సత్కరించారు.

ఓపీఎస్‌ను మ్యానిఫెస్టోలో చేర్చాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 16: ఓపీఎస్‌ను ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం బనగానపల్లె బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బీవీ.సుబ్బారెడ్డికి యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ప్రతాప్ వినతిపత్రం సమర్పించారు. జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్, యూటీఎఫ్ నాయకులు నాగరాజు, దస్తగిరి, సురేష్ సుంకన్న, రంగన్న పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

» సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు



బేతంచెర్లలో రోడ్డుపై బైఠాయించిన పలు సంఘాల నాయకులు



బనగానపల్లెలో ధర్నా చేస్తున్న నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 16: కార్మిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య ఆరోపించారు. శుక్రవారం గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు సీపీఐ కార్యాలయం వద్ద నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ విగ్రహం సర్కిల్‌లో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి కార్మికులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు రాధాకృష్ణ, మోట రాముడు, లక్ష్మీనారాయణ, పుల్లయ్య, అబ్బాస్, పులిశేఖర్, నారాయణ పాల్గొన్నారు.

● **సీఐటీయూ ఆధ్వర్యంలో:** గ్రామీణ భారత్ బంద్ కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి పాతబస్టాండు సమైక్యాంధ్ర కట్ట వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయూ నాయకుడు శివరాం పాల్గొన్నారు.

బేతంచెర్ల: ఆలయాలను కాదు.. ఆకలి తీర్చే రైతన్నను బతికించుకుందాం.. కేంద్ర బీజేపీ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం..! ప్రధాని మోదీ వైఫల్యాలపై చార్జ్‌షీట్ ప్రకటిద్దాం.. అంటూ ఏపీ రైతు సంఘం నాయకులు ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. శుక్రవారం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో దేశ వ్యాప్త గ్రామీణ బంద్ పిలుపులో భాగంగా ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి. సుబ్బరాయుడు, సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ మున్నా, సీఐటీయూ మండల కార్యదర్శి రహంతుల్లా, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ ఆధ్వర్యంలో మద్దిలేటి స్వామి ఆలయ ముఖద్వారం వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేతంచెర్లను కరువు ప్రాంతంగా ప్రకటించి కనీసం నేటికి రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం చెల్లించకుండా, ఉపాధి హామీ పనులను కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎర్రగుడి రాముడు, తిరుమలేష్, దస్తగిరి, పుల్లారెడ్డి, రామతిమ్మారెడ్డి, పుష్పావతి, నాగేంద్రమ్మ, లక్ష్మీదేవి, రమాదేవి, బాలస్వామి, శ్రీకర్, భాస్కర్, కోన రామకృష్ణ, దిలీప్, ప్రదీప్, సాయి, గణేష్, మనోజ్, రవి, మహబూబ్, రామదాసు, మద్దయ్య, కృష్ణప్ప, శ్రీరాములు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి:

వాహన డ్రైవర్లను జైలుపాలుచేసే హిట్ అండ్ రన్ చట్టాలను రద్దు చేయాలని దేశ వ్యాప్త బంద్ పిలుపులో భాగంగా బేతంచెర్ల ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు రంగం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు. శుక్రవారం లారీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో లారీ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు రామాంజనేయులు అధ్యక్షతన పట్టణం లోని కొత్తబస్టాండు నుంచి పాతబస్టాండు వరకు ర్యాలీగా చేరుకుని మాన వహారం నిర్వహించి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికుల సమ్మె కు మద్దతుగా అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు జి.షేబారాణి, ఆశా వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి నాగేంద్రమ్మ, అంగన్‌వాడీ, ఆశాలు, హమాలీ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

బనగానపల్లె: ఆటో డ్రైవర్లకు ఉరితాడు లాంటి 106 జీవో ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలిలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య ఆధ్వ ర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా బనగానపల్లె పట్టణంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకుడు సుబ్బయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లకు ఉరితాడు లాంటి 106 జీవో ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దస్తగిరి, తిరుపాల్, నాగేశ్, శ్రీను, మధు, నాగన్న, సంజన్న, తిమ్మరాజు, వెంకటేశ్వర్లు, బషీర్, మాబాషా, బాలరాజు పాల్గొన్నారు.

వైభవంగా రథసప్తమి



రుద్రవరం మండలం వాసాపురంలో రథాన్ని లాగుతున్న భక్తులు



చాగలమర్రిలో పూజలు చేస్తున్న నరసింహస్వామి మాలధారులు

రుద్రవరం, ఫిబ్రవరి 16: మండలంలోని వాసాపురంలో, రుద్రవరంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు కన్నులపండువగా సాగాయి. వాసాపురంలో ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రథంపై కొలువుదీర్చి రథాన్ని భక్తులు లాగారు. నంద్యాలకు చెందిన యశస్విని, చైత్రలక్ష్మి అనే చిన్నారులు భరతనాట్యం చేశారు. ఈ భరత నాట్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే ఆలయ ఆవరణంలో తాడాట, మ్యూజికల్ చైర్స్ ఇంకా పలురకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, వైస్ చైర్మన్, కార్యదర్శులు ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో శుక్రవారం వేద పండితుల ఆధ్వర్యంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెన్నకేశవ ఆలయంలో నరసింహస్వామి మాల ధరించిన నరసింహస్వామి మాలధారులు ధ్వజస్తంబం వద్ద సూర్యుడికి ప్రీతిగా సూర్య నమస్కారాలు, సూర్య యంత్ర ఆరాదన కార్యక్రమాలు నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు సామూహికంగా రథానికి పూజలు చేసి భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, ఆలయాల అధ్యక్షుడు కొండయ్య, లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవుకు: మండలంలోని శివవరం గ్రామంలోని సూర్య నారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను శుక్రవారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. రథసప్తమి రోజున సూర్యకిర ణాలు మూల విరాట్ సూర్యనారాయణ స్వామిపై పడటం ఈ ఆలయ ప్రత్యేకత. రథసప్తమి సందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు చేశారు.

ఆలయానికి రూ.3లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు

రుద్రవరం, ఫిబ్రవరి 16: రుద్రవరం సమీపంలోని దొర్వి లక్ష్మీనరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారి ఆలయ అభివృద్ధికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు శుక్రవారం రూ.3లక్షలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి మరింత చేయూతనందిస్తానన్నారు. భక్తిమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. దొర్వి నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు, వైద్యుడు సంజీవ్ ప్రత్యేక పూజలు చేశారు. వారిని దొర్వి ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు, నరసింహ పూలమాలలు శాలువాతో సన్మానించారు. అలాగే వాసాపురం వెంకటేశ్వరస్వామి లక్ష్మీ గోదాదేవి, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు పోలా గురుమూర్తి, చిన్నకొండయ్య, డిష్ వెంకటసుబ్బయ్య, డిష్ వెంకటేశ్వర్లు, యాదగిరి శ్రీనివాసులు, గండికోట మహేష్, సురేష్, ఏరువ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: ప్రాచీన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, వాటి అభివృద్ధికి ఎల్లవేలలా సహాయ సహకారాలు అందిస్తానని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు అన్నారు. శిరివెళ్లలో పునఃప్రతిష్ఠిస్తున్న బసవేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకలకు గాను రూ.1,50,116 శుక్రవారం విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయాన్ని, పరిసరాలను పరిశీలించారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరుగనున్న ఆలయ ప్రతిష్ఠ వేడుకలు, పూజా కార్యక్రమాల గురించి చర్చించారు. బసవేశ్వరస్వామి ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి'

శిరివెళ్ల, ఫిబ్రవరి 16: బ్యాంకు ఖాతాదారులు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ నరసింహారావు సూచించారు. రిజర్వ్ బ్యాంకు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో శిరివెళ్లలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. దీని ద్వారా ప్రజలకు డిజిటల్ బ్యాంకింగ్, సామాజిక భద్రత పథకాలు, సైబర్ నేరాలు తదితర వాటి గురించి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, మేనేజర్ అశోక్ కుమార్, ఎల్‌డీఎం రవీంద్ర కుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, వివిధ బ్యాంకుల మేనేజర్లు అనూష, మల్లికార్జున పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని నివారించండి

డోన్(రూరల్), ఫిబ్రవరి 16: డోన్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని డోన్ జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలం రాకమునుపే గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డోన్ మండలంలోని ఆవులదొడ్డి, తిమ్మాపురం, కామగానిగుంట్ల, వెంకటనాయునిపల్లె, చనుగొండ్ల తదితర గ్రామాల్లో తాగునీటి కొరతతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చకమునుపే అధికారులు సమస్య పరిష్కారానికి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

కానాలలో సీఐ రాత్రి బస

బనగానపల్లె, ఫిబ్రవరి 16: మండలంలోని కానాల గ్రామంలో కోవెలకుంట్ల సీఐ శుక్రవారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రామ సభలో సీఐ మాట్లాడుతూ గ్రామంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండల వ్యాప్తంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్ఐ రమేశ్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం: మంత్రి



బూరుగులలో శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

ప్యాపిలి, ఫిబ్రవరి 16: ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పీ ఆర్‌పల్లి, బూరుగుల, జలదుర్గం గ్రామాల్లో కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.300 కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్ పథకం పనులను త్వరలో పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, మీట్ కార్పొరేషన్ చైర్మేన్ శీరాములు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 16: అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీలను జీవో కాపీ రూపంలో అందజేయాలని సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్ల ఆధ్వర్యంలో శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర నాయకులు పిలుపు మేరకు నిరసన ర్యాలీ చేశారు. సీఐటీయూ నాయకులు పద్మావతి, నాగమణి మాట్లాడుతూ ఆటో కార్మికులకు జీవో నంబర్ 12ను రద్దు చేయాలని, పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని, ఆటో కార్మికులకు బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

చాగలమర్రి, ఫిబ్రవరి 16: మండలంలోని పెద్దబోదనం గ్రామంలో పోస్టల్ పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మౌలీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టల్ సిబ్బంది కలిసి ర్యాలీ చేశారు. మౌళీశ్వర్‌రెడ్డి తపాలా జీవిత బీమా, సుకన్య సమృద్ధి యోజన, ఆర్‌డీ, డిపాజిట్ పథకాలపై ప్రజలకు వివరించారు. పొదుపు మహిళలు భాస్కర్‌రావు, పెద్దరాజు, మహినూర్, శ్రావణి, పద్మావతి పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గ్రామీణ ప్రాంతాల్లోని తపాల సేవలు ప్రజలు వినియోగించుకోవాలని ఆళ్లగడ్డ రోస్టర్ ఇన్‌స్పెక్టర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి సూచించారు. తుడుములదిన్నె గ్రామంలో శుక్రవారం సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపోలు భాస్కర్‌రావు, పెద్దరాజు, డీపీలు సుధీర్‌కుమార్‌రెడ్డి, శిలార్‌సాహెబ్, శంకరయ్య, నారాయణమ్మ పాల్గొన్నారు.

వైభవంగా కలశ స్థాపన

చాగలమర్రి, ఫిబ్రవరి 16: మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెంకటేశ్వర, సాయిబాబా, వీరభద్ర, ఆంజనేయస్వామి నూతన ఆలయాల ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం వేద పండితులు పెద్ద శాస్త్రి ఆధ్వర్యంలో మహిళలతో కలశ స్థాపన, గణపతి హోమం, గోపూజ, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పట్టు వస్త్రాలు, కళశాలతో ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠ, దీక్షా హోమం, జలాదివాస కార్యక్రమాలు చేశారు.

తాగునీటి ఎద్దటి నివారణకు చర్యలు'

రుద్రవరం, ఫిబ్రవరి 16: వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య లేకుండా చర్యల్లో భాగంగా జలజీవన్‌మిషన్ పనులు చే యిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ తెలిపారు. శుక్రవారం రుద్రవరం మండల పరిషత్ సమావేశం భవనంలో మండల స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏపీఎం కల్పలతాదేవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

అవుకు 16, ఫిబ్రవరి: అవుకు మండలంలోని వేములపాడు గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో 60 గొర్రె పిల్లలు మృతి చెం దాయి. ఈ ఘటన శుక్రవారం జరిగింది. వేములపాడు గ్రామానికి చెందిన చౌడం కృష్ణుడు గొర్రె పిల్లలను కల్లంలో ఉంచాడు. ఉదయం కుక్కలు దాడి చేయడంతో 60 గొర్రె పిల్లలు మృతి చెందినట్లు బాధి తుడు చౌడం కృష్ణుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దాదాపు 3 లక్షల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

శిరివెళ్ల, ఫిబ్రవరి 16: మండలంలోని యర్రగుంట్ల ఎస్సీ కాలనీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించిన గోపూజతో ముగిసాయి. ప్రజల అభిప్రాయాలు, ఆకాంక్షలు తెలుసుకుని వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రజాపాలన చేసిన శ్రీరామచంద్రుడుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి సూచించారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్‌జీ చేత మహాభారతం, శ్రీమద్రామాయణం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే గోపూజ, కుంకుమార్చన, భజనలు నిర్వహించారు. సీతారామలయ చైర్మన్ జయనాగిరెడ్డి, నాగమల్లేశ్వరరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బనగానపల్లె, ఫిబ్రవరి 16: ప్రతి రోజు యోగా చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని యోగా గురువు ఇల్లూరు రామమూర్తి అన్నారు. రథసప్తమిని పురస్కరించుకొని స్థానిక ఆర్యవైశ్య భవనంలో శుక్రవారం తెల్లవారుజామున సూర్యనమస్కారాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జడ్‌వీ.కృష్ణారెడ్డి, గోపాల్, సూర్యశేఖర్ పాల్గొన్నారు. అలాగే నంద వరం గ్రామ సమీపంలోని సదానందయోగి ఆశ్రమంలో రథసప్తమి వేడుకల సందర్భంగా గురువులు విశ్వనాథ్‌రెడ్డి, తిరుపతయ్యల ఆధ్వర్యంలో యోగా సనాలు వేశారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకి ఉత్సవం

బనగానపల్లె, ఫిబ్రవరి 16: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారికి పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు.

మందలూరులో అహోబిలేశుడికి పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 16: మండలంలోని మందలూరు గ్రామంలో అహోబిళ జ్వాలా లక్ష్మి నరసింహస్వామికి ప్రహ్లాద వరదరాజస్వామికి శుక్రవారం పూజలు చేశారు. గ్రామ పొలిమేరలో పార్వేట ఉత్సవ పల్లకీలో కొలువుదీరిన ఉత్సవమూర్తులకు మేళతాళాల తో గ్రామ పెద్దలు స్వాగతం పలికారు. గ్రామంలో తెలుపులపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. వీఆర్వో ఫకృద్దీన్, కార్యదర్శి ఓబులేసు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో కౌన్సిలర్ కుమారుడిపై కేసు

నంద్యాల, ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఆళ్లగడ్డ పట్టణ కౌన్సిలర్ వరలక్ష్మి కుమారుడు సుధాకర్‌పై కేసు నమోదైంది. వివరాలివీ.. ఆళ్లగడ్డ పట్టణంలోని బోరు గుల బట్టి వీధిలో నివాసం ఉంటున్న భూపాల్‌కు అదే వీధిలోని వెంకటలక్ష్మి రూ.15 లక్షలు అప్పు ఇచ్చారు. భూపాల్ నుంచి అప్పు రాబట్టుకునే ప్రయత్నంలో ఇంటిని రాసి ఇవ్వాలని వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. అప్పు తీసుకున్న వ్యక్తి దీనికి నిరాకరించారు. దీంతో అప్పుదారు భూపాల్ కుమారుడిని కిడ్నాపు చేసి అంతమొందించేం దుకు ప్రయత్నించారు. దీంతో పట్టణ పోలీసులు వెంకటలక్ష్మి, సుధాకర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

'ప్రధానిని గౌరవించని వైసీపీ'

నంద్యాల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర రాజధానిగా అమరావతిని గుర్తించి చేపట్టిన పనుల నిర్మాణానికి దేశ ప్రధాని మోదీ తీసుకొచ్చిన నీరు, మట్టిని లెక్క చేయలేదని టీడీపీ నాయకులు చాంద్‌బాషా, హుసేన్‌బాషా అన్నారు. రాజధాని ఫైల్స్‌ను నిరాకరించిన వైసీపీ ప్రభుత్వంపై శుక్రవారం పట్టణంలోని మాజీ మంత్రి అఖిలప్రియ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రానికి మూడు రాజధానుల పేరుతో వైసీపీ ప్రభుత్వ ముందుకు వెళ్లడంపై వారు తీవ్రంగా విమర్శించారు.

జల్ జీవన్ మిషన్‌పై అవగాహన

దొర్నిపాడు, ఫిబ్రవరి 16: మండలంలోని దొర్నిపాడు వెలుగు కార్యాలయంలో శుక్రవారం వెలుగు ఏపీఎం బాబు ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్‌పై అవగాహ సదస్సు నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ మాట్లాడుతూ ఎండకాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పలు సూచనలు, సలహాలు పాటించాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చాగలమర్రి, ఫిబ్రవరి 16: మండలంలోని నేలంపాడు, రాంపల్లె, కేపీ తాండ, తోడెండ్లపల్లె, మల్లేవేముల, గొట్లూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రమణమ్మ శుక్రవారం పరిశీలించారు. ఆమె వెంట వీఆర్వోలు, గ్రామ సేవకులు ఉన్నారు.

పదిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సుధాకర్‌రెడ్డి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 16: మండలంలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి కోరారు. శుక్రవారం కొలిమిగుండ్ల మోడల్‌స్కూల్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంచి మార్కులతో పదిలో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. నాడు నేడు పనులను పరిశీలించారు. అనంతరం తిమ్మనాయునిపేట హైస్కూల్‌ను తనిఖీ చేశారు. కొత్తగా తిమ్మనాయునిపేట హైస్కూల్‌లో పదోతరగతి పరీక్షాకేంద్రం మంజూ రైందన్నారు. కార్యక్రమంలో ఓపెన్‌స్కూల్ సెక్టోరియరిల్ అధికారి లక్ష్మీనా రాయణ, అలెస్కో రఘురామిరెడ్డి, ఎంఈవో అబ్దుల్‌కలాం, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ప్యాపిలి, ఫిబ్రవరి 16: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి చిన్నరహిమాన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో సీఐటీయూ కార్మికులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రహిమాన్ మాట్లాడుతూ రైతుకు ఇచ్చిన హామీలను బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు.